

# పరదేశీ కథలు

## - లలిత చిట్టే



-76 -

## పరదేశంలో బతుకుచిత్రం

"ఇబ్బా.. (నాన్నా) నాకీ ఇండియా కద్దామా (పనిమనిషి) వద్దు. ఏ మాట చెప్పినా అర్థం చేసుకోవడంలేదు. అన్నీ పదిసార్లు వివరించి చెప్పాల్సి వస్తోంది. తనకు అరబ్బీ అర్థంకాదు. ఏది అడిగినా హిందీ భాషలో ఏదేదో తిక్కగా జవాబులు చెప్తోంది. దీనితో వేగలేక నాకు పిచ్చిపడుతోంది. వస్తువులన్నీ సరైన స్థలంలో అమర్చి పెట్టకుండా తనకిష్టమొచ్చిన చోట పెడుతోంది. వెతుక్కోలేక నా తల ప్రాణం తోక కొస్తోంది". పనిమనిషి సుగుణ గురించి చెబుతూ కోపంతో గంతులేసింది ఫాతిమా.

నాన్న దగ్గర చాలా గారాబం ఆమెకు. ఆయనకు కూతురంటే ప్రాణం. కూతురు కోరితే కొండమీద కోతినైనా నిమిషంలో తెచ్చిస్తాడు ఆయన. కూతురు మాటలకి ఒక్క నిముషం ఆలోచించాడు.

"బెంతీ.. (కూతురా) నువ్వు చెప్పింది నిజమే. ఆ కద్దామా వచ్చి నాల్రోజులయింది. ఇంతలోపల ఇక్కడి పని ఎలా నేర్చుకోగలదు. మనమే ఒక్కొక్కటీ ఓపికగా చెప్పి నేర్పించాలి. అయినా తన వయసెంతని. నీకంటే రెండేళ్ళు పెద్దది వుంటుందనుకుంటా. తొందరగా మన భాష, ఈ పనీ నేర్చుకుందంటే ఒక గంటలో ఇల్లంతా చక్కగా నువు కోరినట్లుగా అమర్చి పెడుతుంది. ఒక పది రోజులు నువ్వు దగ్గరుండి చెప్పి చూడు చాలు." చిన్నగా నవ్వుతూ కూతుర్ని బుజ్జగించాడు బాబా.

తండ్రి మాటలకు కాస్త శాంతించింది ఫాతిమా.

"సరే అలాగే చేస్తాను ఇబ్బా. నువ్వు చెప్పినట్లు పదిరోజులు నేర్పిస్తాను అంతే. ఆ తరువాత నేనొప్పుకోను. నువ్వేం చేస్తావో నాకు తెలియదు. నాకు ఓపిక లేదు" చెప్పింది కాస్త కోపంగా.

"ఆ అల్లా నీకు ఓపిక ఇస్తాడు బెంతీ. నువ్వు ఐదుపూటలా నమాజు చేస్తున్నావా" అడిగాడు బాబా.

"హా అపుడపుడూ మసీదులోనుండి అల్లాహు అక్బర్ వినిపించినప్పుడు చేస్తున్నాను బాబా. ఉదయాన్నే నాలుగు

గంటలకు రోజూ మెలకువ రావడం లేదు. ఏం చెయ్యను?" గారంగా బదులు చెప్పింది ఫాతిమా.

"నువ్వింకా చిన్నపిల్లవి కాదు. పద్దెనిమిదేండ్లు నిండాయి. అలవాటు చేసుకుంటే అదే సమయానికే రోజూ ఠక్కున మెలకువ వచ్చేస్తుంది. నాల్రోజులు అలారం పెట్టుకుని ప్రయత్నించు. ప్రార్థన మనిషికి శాంతస్వభావాన్ని అందిస్తుంది. సత్ప్రవర్తనను అలవరచుకునేలా ప్రేరేపిస్తుంది. అల్లా నిన్ను ఆశీర్వదించును గాక" దీవించాడు బాబా.

"సరే బాబా అలాగే చేస్తాను" అని చెప్పి నవ్వుతూ తన రూం లోకి వెళ్ళిపోయింది ఫాతిమా.

అంతవరకూ తలుపు చాటున నిలబడి భయపడుతూ వారి మాటలు వింటున్న సుగుణ అరబ్బీ అంతగా అర్థంకాకపోయినా చివరికి ఫాతిమా నవ్వడం చూసి హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంది. వారి హావభావాలు కొంచెం అర్థమయినట్లుగా అనిపించాయి. బాబా మంచివాడే ఫాతిమాకే కాస్త తొందరపాటు ఎక్కువ అనుకుంది మనసులో.

"ఇబ్బా రేపు నేను షాలే వెళ్తున్నాను. నాతోపాటూ నా ఫ్రెండ్స్ అబ్రార్, నూరా కూడా వస్తున్నారు. అక్కడ రెండ్రోజులు మన గెస్ట్ హౌజ్ లోనే వుంటాము. సరదాగా సముద్రపు ఒడ్డున గడిపి తిరిగొస్తాం" అర్థింపుగా చెప్పింది ఫాతిమా.

మొదట వద్దన్నా తరువాత తన మాటను తండ్రి కాదనడని తెలుసామెకు. ఏదో ఒకటి చెప్పి ఒప్పించగలననే నమ్మకం ఆమెకుంది.

"సరేగానీ నీతోపాటూ కద్దామాను కూడా తీసుకెళ్ళు. తోడుంటుంది. మీ పనులు చేసిపెడుతుంది". చెప్పాడు బాబా.

"అబ్బా.. సరదాగా ఫ్రెండ్స్ అంతా గడపడానికి వెళ్తుంటే మధ్యలో కద్దామా ఎందుకు డాడీ?" విసుక్కుంది ఫాతిమా.

"అయితే వద్దు బేబీ. సుగుణ వస్తే నిన్ను కనిపెట్టుకుని వుంటుంది. నీ మంచీ చెడ్డా చూస్తుంది. ఇక్కడ నాకు కాస్త ధైర్యంగా వుంటుంది" ఖచ్చితంగా చెప్పాడు బాబా.

ఇక ఏమిచెప్పినా వినడని ఇంకా గట్టిగా వాదిస్తే అసలే వద్దంటాడని గ్రహించిన ఫాతిమా "హ్మ్.. సరేలే బాబా నీ మాట ప్రకారమే తీసుకెళ్తాలే" అంటూ ఒప్పుకుంది.

అనుకున్నట్లుగానే మరుసటిరోజు అందరూ కార్లేసుకుని ఎడారిలో అరేబియా సముద్రతీరాన వున్న షాలే వైపు బయలుదేరారు. దారిలో వీరికి తోడుగా నలుగురు అబ్బాయిలు కూడా తోడయ్యారు. అమ్మాయిలు తమ కార్లను దారిలో వున్న ఒక పార్కింగ్ ప్లేస్ లో వుంచి అబ్బాయిల కార్లను ఎక్కారు. కార్లోనే బురఖాలను, వేసుకున్న డ్రస్సులను తీసిపారేసి షార్ట్ లలోకి స్లీవ్ లెస్ టాప్ లలోకి మారిపోయారు. కారంతా మారుమ్రోగేలా పాటలు ఫుల్ సౌండ్ తో పెట్టి వళ్ళంతా ఊగిపోయేలా చప్పట్లు కొడుతూ కేకలు వేయసాగారు. మధ్యలో సుగుణ వుండటం

వారికి ఇబ్బందిగా వున్నా పనిమనిషే కదా అని లెక్కలోకి తీసుకోలేదు. కానీ ఫాతిమాకు లోపల కాస్త భయంగానే వుంది. తండ్రి ఎంత మంచివాడో తప్పుచేస్తే కోపమొస్తే అంత దుర్మార్గుడు. ఒకవేళ ఇక్కడ అబ్బాయిలతో తిరిగినట్లు ఈ పనిమనిషి ఆయనకు చెప్పిందంటే చాలా ప్రమాదం. ఇలాంటి విషయాలను ఆయనసలు ఒప్పుకోడు.

ఇప్పుడు ఈ సుగుణను ఎలా వదిలించుకోవాలో అర్థం కావడంలేదు. దారంతా అమ్మాయిలూ, అబ్బాయిలూ కూల్ డ్రింక్స్ తాగుతూ ఈలలు వేస్తూ గోలగోల చేసారు. ఇదంతా కొత్తగా ఆశ్చర్యంగా వుంది సుగుణకి.

ఓహో ఇక్కడ అమ్మాయిలు అబ్బాయిలూ ఇలా వుంటారా. ఈ విధంగా ఎంజాయ్ చేస్తారా అనుకుంటూ గుడ్లప్పగించి ఆశ్చర్యంగా వారిని చూస్తోంది. కార్లన్నీ ఎడారి ఇసుకదారుల్లో సాగిపోయి దాదాపూ అయిదు గంటలు ప్రయాణించి షాలే చేరుకున్నాయి.

ఒకవైపు సముద్రం ఆ ఒడ్డున వరుసగా కట్టిన ఇండ్లు బొమ్మరిల్లుల్లా, అందంగా చూడముచ్చటగా వున్నాయి. ఇంటిముందున్న పూలతోటలు, ఖర్జూరపు చెట్లు మదికి ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. వీళ్ళ రాకకు సంతసించి రమ్మని ఆహ్వానిస్తున్నట్లుగా సముద్రం అలలతో పోటెత్తి పొంగుతోంది. నీళ్ళను చూడగానే అందరిలోనూ ఉత్సాహం ఉరికి వచ్చింది. "తొందరగా స్విం సూట్లు వేసుకుంటే చీకటి పడకముందే అందరం ఈత కొట్టచ్చు" చెప్పింది నూరా.

"అవును నిజమే పదండి నీళ్ళల్లో ఆడుకుందాం" వంత పాడాడు అహ్మద్ అనే అబ్బాయి.

వెంటనే పొట్టి డ్రస్సులేసుకుని సముద్రంలోకి ఉరికారందరూ. ఆడామగా తేడా లేకుండా చీకటిపడేంతవరకూ ఆటలాడుకున్నారు. నీళ్ళలోకి దిగమని బలవంతం చేసినా ఇష్టం లేకపోవడంతో కాదనిచెప్పి వారిని గమనిస్తూ ఒడ్డునే కూర్చుంది సుగుణ. వారి నవ్వులూ, కేరింతలూ, ఆటపాటలతో సముద్రపు అలలు చిన్నబోయాయి. అందరూ హాల్లోకూర్చుని బ్లాక్ లో తెచ్చుకున్న మద్యాన్ని బయటికి తీసారు.

అందరూ కలిసి తాగుతూ, తెచ్చుకున్న ఫుడ్ ను తింటూ కబుర్లతో, డాన్సులతో కాసేపు ఎంజాయ్ చేసారు. నిషా తలకెక్కుతోంది. అందరూ ఇరవై యేళ్లు దాటని వాళ్ళే. యవ్వనం నరనరాల్లో ప్రవహిస్తూ వంటిని ఉదృతంగా వేడిక్కించే వయసున్నవాళ్ళే. కువైట్ ధనికదేశం కావడంతో పిల్లలు కష్టమెరుగకుండా విలాసంగా ఇష్టమొచ్చినట్లుగా జీవిస్తుంటారు. ఇస్లాం మత సిద్ధాంతాలప్రకారం కొన్ని కట్టుబాట్లు వున్నా చాటుగా మాటుగా వాటిని అతిక్రమించి పార్టీలపేరుతో ఎంజాయ్ చేస్తుంటారు. పెద్దలు పైకి మందలిస్తున్నా లోపల పిల్లలు కదా జీవితాన్ని సంతోషంగా అనుభవించనీలే అనుకుంటూ చూసీ చూడనట్లుగా పోతుంటారు.

దేనికీ కొదవలేని జీవితం. భూమిలో పెట్రోలు పొంగిపొరలుతుంటే ప్రభుత్వం ప్రజలకు సమస్తం ఉచితంగా సమకూర్చుతుంటే బాధ్యతలెరుగని జీవితాన్ని గడుపుతుంటారు వీళ్ళు. తాగేకొద్దీ కళ్ళు ఎర్రబడిపోతున్నాయి. వంటిని మైకం కమ్ముకుంటోంది. శరీరం ఏదో కావాలని ప్రేరేపిస్తోంది. అమ్మాయిలూ అబ్బాయిలూ ఒకరిపక్కకు మరొకరు చేరిపోయారు. సిగ్గు అనేది మరిచిపోయారు. ఫాతిమా పక్కన హమ్మాది అనే అబ్బాయి చేరాడు. అక్కడే హాల్లోనే విచ్చలవిడిగా ప్రవర్తించసాగారు.

చూస్తున్న సుగుణ ఇక ఆగలేకపోయింది. వచ్చేముందు బాబా పక్కకు పిలిచి మరీ చెప్పాడు ఫాతిమాను జాగ్రత్తగా చూసుకోమని. చెప్పడం తన బాధ్యత అనుకుంది సుగుణ. దగ్గరికెళ్ళి అలా చేయవద్దని వారించింది.

మత్తులో వున్న ఫాతిమాకు సుగుణ మాటలు తలకెక్కలేదు.

"హేయ్ నువ్వు పనిమనిషివని గుర్తుంచుకో. నోర్మూసుకుని దూరంగా వెళ్ళు" అని విసుక్కుంది. అయినా విడవలేదు సుగుణ. దగ్గరికెళ్ళి పక్కనే కూర్చుంది. కోపంతో సుగుణ చెంపను చెళ్ళుమనిపించింది ఫాతిమా.

ఒకవైపు హమ్మాది ఫాతిమాను వదలకుండా అల్లుకుపోతున్నాడు. అవతలనున్న మిగతా రెండుజంటలూ ఈ ప్రపంచాన్నే మరిచి వేరేలోకంలో విహరిస్తున్నాయి.

ఏం చెయ్యాలో అర్థంకాలేదు సుగుణకు. ఇక కాదని రెండు చేతులతోపట్టి హమ్మాదిని దూరంగా లాగేసింది.

చేతికందిన పండును వచ్చి ఎవరో లాక్కున్నట్లుగా కోపంతో రగిలిపోయాడు హమ్మాది.

"చూడు నిన్నేం చేస్తానో ముందు నిన్నే అనుభవిస్తాను" అంటూ వచ్చి సుగుణమీద పడ్డాడు వాడు.

ఊహించని పరిణామానికి విస్తుపోయింది సుగుణ. ఎంతగా ప్రతిఘటించినా లాభం లేకపోయింది. వాడి పశుబలం ముందు ఆమె ఓడిపోయింది. అయినా ఆమె తృప్తిగా నిట్టూర్చింది. వాడి చేతిలో ఫాతిమా పాడవలేదనే సంతృప్తితో.

పొద్దున్నే నిషా తగ్గాక జరిగిందేమిటో ఫాతిమాకు అర్థమవసాగింది. అనవసరంగా ఈ పనిమనిషిని తీసుకొచ్చి సంతోషంగా గడపలేకపోతున్నాను. ఇది చాలా అడ్డమైపోయింది. దీన్ని ఇంటికి తీసుకుపోతే ఇక్కడ జరిగిన విషయాలను తండ్రికి చెప్పిందంటే మరీ ప్రమాదమని ఆలోచించి "ఏం చేద్దాం" తన స్నేహితులను సలహా అడిగింది.

"దీన్ని ఇక్కడే వదిలించుకుంటే మంచిది. మధ్యదారిలో వదిలేద్దాం. మన వస్తువులు దొంగలించి పారిపోయింది అని చెబుదాం. తనకు అరబ్బీ కూడా రాదు కాబట్టి మన అడ్రెస్ తెలియదు. మనల్ని వెతుక్కుంటూ మన ఇంటికి రాలేదు. ఇక్కడే ఎక్కడో, ఒకచోట ఇండియావాళ్ళ దగ్గరచేరి బతుకుతుంది. లేదంటే పోలీసుల కంటబడి పట్టుకుంటే చట్టవిరుద్ధంగా తిరుగుతోందని ఇండియాకు పంపించేస్తారు." సలహా ఇచ్చారు ఫ్రెండ్స్.

"ఐడియా బావుంది. అలాగే చేద్దాం లేదంటే మా నాన్న నన్ను చంపేస్తాడు". తలూపింది ఫాతిమా.

మరుసటిరోజు సుగుణను అక్కడే సముద్రపు ఒడ్డున వదిలేసి అందరూ కార్లెక్కి వెళ్ళిపోయారు. దిక్కుతోచలేదు ఆమెకు. పరాయిదేశంలో భాష రాకుండా ఎవ్వరూ లేకుండాఆ సముద్రతీరంలో ఒంటరిగా ఏమిచెయ్యాలో అర్థం కాక అలాగే కూర్చుండిపోయింది.

మధ్యాహ్నం దాటింది. సాయంత్రమయింది. అక్కడనుండి ఆమె కదలలేదు. ఏం చెయ్యాలో ఎక్కడికి వెళ్ళాలోకూడా అర్థం కాలేదు. ఆకలితో కడుపులోని పేగులు మూలుగుతున్నాయి. దాహంతో నాలుక పిడచ కట్టుకు పోతోంది. ఎదురుగా సముద్రం. చుట్టూ నిశ్శబ్దం. ఆమె హృదయంలాగే ఏడవలేక భోరున వీస్తోంది గాలి. ఏరీ తనవాళ్ళు. ఎవరు మన వాళ్ళు. నా అనుకున్నవాళ్ళు తన ఇష్టాఇష్టాలతో ప్రమేయంలేకుండా డబ్బుకోసం కువైట్ కి పంపించి చేతులు దులుపుకున్నారు. డబ్బుకున్న ప్రాముఖ్యత మనిషికి లేకుండాపోయింది. ఇక్కడ అనుకోని విపత్కరపరిస్థితుల్లో చిక్కుబడిపోయింది. ఇప్పుడు ఈ గడ్డుపరిస్థితిని గట్టెక్కే మార్గమేది? ఆలోచిస్తూ, విలపిస్తూ వుండిపోయింది సుగుణ.

సందెచీకట్లు ముసురుకుంటున్నాయి. సముద్రం అలలతో ఎగసిపడుతోంది. తీరం చేరాలనా, ఆకాశాన్ని అందుకోవాలనా. ఏంటో దాని తాపత్రయం.

చుట్టూ కనుచూపుమేర మనిషి అలికిడి లేదు. ఎక్కడో దూరంగా షాలేల్లోని లైట్లు మిణుకుమిణుకు మంటున్నాయి. చీకటి ముసిరేకొద్దీ కాస్త భయమనిపించసాగింది. ఆ షాలే దగ్గరికి వెళితే ఎవరైనా ఆశ్రయం ఇస్తారేమో చూడాలి. బయట శరీరాన్ని పీక్కుతినే ఎడారిచలిని భరించడం కష్టం. భారంగా అడుగులు వేసిందామె. రోడ్డులోకి వచ్చింది. ఇక పదడుగులు వేస్తే వరుసగా వున్న షాలేల దగ్గరికి చేరుకుంటుంది. ఇంతలో వెనకనుండి ఒక కారు రయ్యిన దూసుకొచ్చి చుట్టూ తిరిగి ఆమె ముందు ఆగింది. డోర్ తెరుచుకుని బాబా కిందకి దిగాడు. బాబాను చూడగానే సుగుణకు సంతోషం కలిగింది. బాబా అని బిగ్గరగా కేకవేసి ఏడ్వనారంభించింది. కానీ బాబా ముఖంలో కాఠిన్యం, కోపం చూసి ఏడ్వటం ఆపేసింది. బాబా కళ్ళు ఎర్రగా మండుతున్నాయి. చేతిలోనుండి చెర్నాకోలను బయటికి తీసాడు బాబా.

"ఏయ్.. నా బెంతి (కూతురు) ఫాతిమాను వదిలేసి ఎందుకు పారిపోయావ్ నువ్వు?" గద్దించాడు.

బాబా కోపం చూసి వణికిపోయింది సుగుణ.

ఏమి జవాబు చెప్పాలో అర్థం కాలేదు. మాట్లాడాలంటే భాష రాదు. భయంతో నోరు పెగలడం లేదు. అలాగే నిశ్చేష్టలా నిలబడిపోయింది.

ఇంతలో అక్కడ వున్న వాచ్ మెన్ పరిగెత్తుకుని బయటికి వచ్చాడు.

"బాబా సలామాలేకుం దీని తప్పేమీ లేదు, ఇది పారిపోలేదు బాబా మీ వాళ్ళే ఆమెను ఇక్కడ వదిలేసి వెళ్ళిపోయారు." అని చెప్పాడు అరబ్బీ భాషలో వినయంగా.

వాడి మాటలతో బాబా శాంతించాడు.

వాడు ఏమి చెప్పాడో పూర్తిగా అర్థం కాకపోయినా మంచిగానే చెప్పాడనుకుంది సుగుణ.

చెర్నాకోల అక్కడ పారేసి సుగుణను కారెక్కమన్నాడు బాబా. మారుమాట్లాడకుండా కారెక్కింది సుగుణ. దారిలో ఒక రెస్టారెంట్ దగ్గర కారాపి మెక్ డొనాల్డ్స్ లో ఫుడ్ తినమన్నాడు. అలవాటులేని ఆహారమయినప్పటికీ ఆకలితో వుందేమో ఆవురుమని ఆ బర్గర్ ను తినేసి నీళ్ళు తాగింది సుగుణ. చాలాదూరం ఆ ఎడారిలో ప్రయాణించి అర్థరాత్రి ఇంటికి చేరుకున్నారు వారు.

ఇంట్లో అడుగు పెట్టగానే "ఫాతిమా" అంటూ కేకలేసి కూతుర్ని పిలిచాడు. పైన గదిలో వున్న ఫాతిమా ఉలిక్కిపడి లేచి కిందకి పరిగెత్తుకొచ్చింది.

"నిజం చెప్పు ఏం జరిగిందో" అంటూ అరిచాడు బాబా.

బాబా కోపం చూసి బెంబేలెత్తిపోయింది ఫాతిమా. గజగజా వణుకుతూ జరిగిన విషయాలను చెప్పేసింది.

మండిపడ్డ బాబా చెర్నాకోలను తీసుకుని ఫాతిమాను కొట్టబోయాడు.

సుగుణ బాబా కాళ్ళకు అడ్డంపడి వద్దు "బాబా కొట్టద్దు" అంటూ వేడుకొంది.

"చూసావా నువ్వు తనను ఆ ఎడారిలో వదిలేసి వచ్చినా నీ కోసం ఎంతగా తల్లడిల్లిపోతోందో. డబ్బులేక, పుట్టిన దేశాన్ని అయినవాళ్ళను విడిచి పనిమనుషులుగా పరాయిదేశానికి వస్తారు వీళ్ళు. మనకు ఏండ్లతరబడి సేవ చేస్తారు. మనకోసం ప్రాణమిచ్చేంతగా మనల్ని ప్రేమిస్తారు. నీకోసం, నిన్ను కాపాడాలనే ఉద్దేశంతో ప్రాణంతో సమానమయిన తన శరీరాన్ని సైతం హమ్మూదికి అప్పగించింది సుగుణ. అందుకై నువ్వు ఆమెకు జన్మంతా రుణపడి వుండాలి. ఈ దేశంలో మనం కాకపోతే వాళ్ళకు వేరే దిక్కు ఎవరున్నారు. మనమే వారిని హింసిస్తే, వదిలేస్తే వారిబాధను ఎవరికి చెప్పుకుంటారు. మనల్ని నమ్మి ఈ దేశానికి వచ్చిన పనివారిని మనం గౌరవించాలి. దయతో చూడాలి.తెలుసుకో" అంటూ కూతురికి హితబోధ చేసాడు తండ్రి.

సిగ్గుతో తలవంచుకుంది ఫాతిమా.

సంతోషంగా ఊపిరి పీల్చుకుంది సుగుణ.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments